తెలంగాణ

రాజ కుటుంబానికి ఏటీఎం

మొదటిపేజీ తరువాయి...

ర్యాలీలో ఆయన ప్రసంగించారు. 'ఎక్కడ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే.. ఆ రాష్ట్రం కాంగ్రెస్ రాజ కుటుంబానికి డబ్బులు అందించే ఏటీఎంగా మారిపోతుంది. ఇప్పుడు కాంగ్రెస్ రాజ కుటుంబానికి తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు ఏటీఎంలుగా మారిపోయాయి. మహారాష్ట్రలో ఎన్నికలు జరుగుతుంటే తెలంగాణ, కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ వసూళ్లకు పాల్పడుతున్నది. మహారాష్ట్రలో ఎన్నికల కోసం తెలంగాణ, కర్ణాటకలో వసూళ్లు రెట్టింపయ్యాయని ప్రజలు చెప్పున్నారు. కర్ణాటకలోని లిక్కర్ వ్యాపారుల నుంచి రూ.700 కోట్లు వసూలు చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి.' అని మోదీ ఆరోపించారు.

ఎన్నికల్లో గెలిచేందుకే ఇంత అవినీతా?

ఎన్నికల్లో గెలిచేందుకే కాంగ్రెస్ పార్టీ ఇంత భారీ అవినీతికి పాల్పడుతున్నప్పుడు ఆ పార్టీ గెలిస్తే ఇంకెంత అవినీతి చేస్తుందో ఊహించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్రను కాంగ్రెస్ పార్టీకి ఏటీఎం కానివ్వబోమని అన్నారు. మహా వికాస్ అఘాడీ అంటే అవినీతి, డబ్బు తీసుకొని పోస్టింగ్‌లు ఇచ్చే వ్యాపారం చేసిందని దేశమంతా తెలుసని ఆరోపించారు. దళితుడు అయినందున, రాజ్యాంగాన్ని రచించిన కీర్తి దక్కినందుకే అంబేద్కర్ అంటే కాంగ్రెస్ రాజ కుటుంబానికి ద్వేషమని ఆయన పేర్కొన్నారు. ఓబీసీలు, దళితులు, ఆదివాసీల మధ్య గొడవపెట్టి ఓట్లు దండుకోవాలనేది కాంగ్రెస్ ఆలోచన అని అన్నారు. లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ కాంగ్రెస్‌కు తెలంగాణ రాష్ట్రం కొత్త ఏటీఎంగా మారిందని ప్రధాని మోదీ ఆరోపించిన సంగతి తెలిసిందే. కాగా, కర్ణాటకలో ఇటీవల మద్యం వ్యాపారుల సంఘం ఎక్సైజ్ శాఖపై తీవ్ర అవినీతి ఆరోపణలు చేసింది. బార్ లైసెన్సులు ఇవ్వడానికి భారీగా లంచాలు తీసుకుంటున్నారని, రూ.700 కోట్ల వరకు అవినీతి జరిగిందని ఆరోపించిన సంగతి తెలిసిందే.

యెడియూరప్ప అవినీతి నిజమే!

- కొవిడ్ మందుల కొనుగోలులో కోట్ల రూపాయల గోల్‌మాల్
- నిర్ధారించిన మైఖేల్ కమిషన్
- మాజీ సీఎంపై చర్యకు సిఫారసు

బెంగళూరు: కొవిడ్-19 సమయంలో పీపీఈ కిట్లు, మందుల కొనుగోలులో భారీ అవినీతి జరిగిందంటూ కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నేత బీఎస్ యెడియూరప్పపై వచ్చిన ఆరోపణలను రిటైర్డ్ హైకోర్టు జడ్జి మైఖేల్ డీచున్హా కమిషన్ నిర్ధారించింది. యెడియూరప్ప, అప్పటి ఆరోగ్య శాఖ మంత్రి బీ శ్రీరాములుపై అవినీతి నిరోధక శాఖ చట్టం కింద చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది. ఈ కొనుగోలు వ్యవహారంలో రూ.150 కోట్ల గోల్‌మాల్ జరిగింది. తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై విచారణకు కమిషన్‌ను నియమించింది. దీనిపై యెడియూరప్ప స్పందిస్తూ ఇవన్నీ కాంగ్రెస్ రాజకీయ ఉద్దేశంతో చేపట్టిన కక్ష సాధింపు చర్యలని అన్నారు. దర్యాప్తులో నిజం బయటపడుతుందని అన్నారు. కమిషన్ ఇచ్చిన నివేదికపై ఆరోగ్య శాఖ మంత్రి గుండూరావు స్పందిస్తూ కొవిడ్‌తో ఒక పక్క ప్రజలు చనిపోతున్నా, దానిని అక్రమార్జనకు అప్పటి బీజేపీ ప్రభుత్వం వినియోగించుకుందని విమర్శించారు. దీనిపై విచారణ ప్రారంభిస్తామని, తక్షణం కొన్ని చర్యలు చేపడతామని చెప్పారు.

అధిక ధరలకు కొనుగోలు

2020 మార్చి, ఏప్రిల్ నెలల్లో యెడియూరప్ప ప్రభుత్వం పెద్దయెత్తున పీపీఈ కిట్లు, మందులు కొనుగోలు చేసింది. వీటిలో చాలా కంపెనీలు చైనాకు చెందినవి కాగా, నిర్దేశించిన మొత్తం కన్నా అధిక ధరతో వీటిని కొనుగోలు చేసినట్టు ఆరోపణలు వచ్చాయి.

మహారాష్ట్రలో 29 సీట్లలో స్నేహపూర్వక పోటీ

ఇరు కూటములకు తప్పని మిత్రుల బెడద

ముంబై, నవంబర్ 9: ఈ నెల 20న జరిగే మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు 'మిత్రుల' బెడద తప్పడం లేదు. పొత్తు ఉన్నప్పటికీ 29 నియోజకవర్గాల్లో ప్రధాన కూటముల మధ్య స్నేహపూర్వక పోటీ కొనసాగుతున్నది. ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న మహావికాస్ అఘాడీ (ఎంవీఏ) 21 సీట్లలో ఈ స్నేహపూర్వక పోటీ ఎదుర్కోవడం ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా నాందేడ్ ఉత్తర సీట్‌కు కాంగ్రెస్ నుంచి అబ్దుల్ గఫార్, శివసేన (యూబీటీ) నుంచి సంగీతా పాటిల్ నువ్వా నేనా అని పోటీ పడుతున్నారు. మహాయుతి కూటమికి కూడా ఆరు స్థానాల్లో స్నేహపూర్వక పోటీ తప్పలేదు.

ఒక్కరోజు ఆలస్యమైనా ప్రాథమిక హక్కులపై ప్రభావం

బెయిల్ పిటిషన్ల జాప్యంపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: బెయిల్ దరఖాస్తులపై విచారణను సంవత్సరాల తరబడి పెండింగ్‌లో పెట్టే సంప్రదాయంపై సుప్రీంకోర్టు మండిపడింది. ఇటువంటి అంశాలపై నిర్ణయం తీసుకోవడంలో కనీసం ఒక రోజు ఆలస్యం జరిగినా, ప్రజల ప్రాథమిక హక్కులపై ప్రతికూల ప్రభావం పడుతుందని చెప్పింది. తన బెయిల్ దరఖాస్తును అలహాబాద్ హైకోర్టు గత ఏడాది ఆగస్టు నుంచి పెండింగ్‌లో పెట్టిందని ఓ వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పదే పదే కేసును వాయిదా వేస్తున్నారని ఆరోపించారు. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు శుక్రవారం ఈ వ్యాఖ్యలు చేసింది. హైకోర్టులో తదుపరి విచారణ ఈ నెల 11కు వాయిదా పడిన విషయాన్ని తెలుసుకుని, అదే రోజున విచారణ జరపాలని హైకోర్టు జడ్జిని సుప్రీంకోర్టు కోరింది. రెండు వారాల్లోగా తీర్పు వెల్లడించాలని చెప్పింది.

అయోధ్య రామాలయానికి కూలీల కొరత

నిర్మాణం 3 నెలలు ఆలస్యం

అయోధ్య: యూపీలోని అయోధ్య రామాలయం నిర్మాణానికి కూలీల కొరత ఏర్పడింది. వాస్తవానికి ఈ ఆలయ నిర్మాణాన్ని వచ్చే ఏడాది జూన్‌కు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, దానిని సెప్టెంబర్‌కు పొడిగించారు. మొదటి అంతస్తులో ఏర్పాటు చేయాల్సిన కొన్ని ప్రత్యేక రాళ్ల ఏర్పాటుకు సుమారు 200 మంది పనివారి కొరత ఉన్నందున నిర్మాణం పూర్తి చేయడంలో ఆలస్యం జరుగుతున్నట్టు ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా తెలిపారు.

నల్సా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా జస్టిస్ గవాయ్

న్యూఢిల్లీ : జాతీయ న్యాయ సేవల అథారిటీ (నల్సా) కార్యనిర్వాహక అధ్యక్షునిగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ నియమితులయ్యారు. 11 నుంచి ఆయన బాధ్యతలు చేపడతారని కేంద్ర న్యాయశాఖ తెలిపింది. ఈ అథారిటీ సమాజంలోని బలహీన వర్గాలకు ఉచితంగా న్యాయ సేవలను అందిస్తుంది. అథారిటీకి ప్యాట్రన్-ఇన్-చీఫ్‌గా సీజేఐ వ్యవహరిస్తారు. సీజేఐ తర్వాత సీనియర్ మోస్ట్ జడ్జి ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్‌గా పని చేస్తారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా సీజేఐ కావడంతో జస్టిస్ గవాయ్ సీజేఐ తర్వాత సీనియర్ మోస్ట్ జడ్జి అవుతారు.

హేమంత్ సారేన్ సహాయకుడి ఇంటిపై ఐటీ దాడులు

రాంచీ: మరికొద్ది రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న జార్ఖండ్‌లో ఐటీ దాడులు కలకలం రేపాయి. జార్ఖండ్ సీఎం హేమంత్ సారేన్ సహాయకుడి ఇల్లు, కార్యాలయాల్లో ఆదాయ పన్ను శాఖ (ఐటీ) అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. రాంచీ, జంషెడ్‌పూర్‌లలో మొత్తం తొమ్మిది చోట్ల సోదాలు చేశారు. సీఎం హేమంత్ సారేన్ సహాయకుడు సునిల్ శ్రీవాస్తవకు చెందిన ఇండ్లు, కార్యాలయాల్లో అధికారులు దాడులు జరిపినట్టు తెలిసింది. రాష్ట్రంలో అక్రమ మద్యం వ్యాపారం, గనుల తవ్వకానికి సంబంధించి ఆరోపణలు రాగా, వీటిపై సీబీఐ, ఈడీ దర్యాప్తు చేస్తున్నాయి.

ఆకాశ నౌక.. పునరాగమనం!

- ఎయిర్‌షిప్స్ వాడకంపై మళ్లీ శాస్త్రవేత్తల యోచన
- విమానాలతో పర్యావరణ కాలుష్యమే కారణం
- 'ఎయిర్‌షిప్స్' తయారీలో ఇప్పటికే పలు కంపెనీలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): 'ఊయల ఊగి.. ఊగి.. ఉన్నచోటుకే వస్తుందంటారు'.. ఎయిర్‌షిప్ వాడకం లోనూ ఇప్పుడు ఇదే పరిస్థితి పునరావృతమవుతున్నట్టు కనిపిస్తున్నది. ఏడెనిమిది దశాబ్దాల కిందటివరకూ వినియోగించిన ఎయిర్‌షిప్‌లను విమానాల స్థానంలో మళ్లీ తీసుకురావడానికి పెద్దయెత్తున కసరత్తు ప్రారంభమయ్యింది.

■ ఏమిటీ ఎయిర్‌షిప్?

తిమింగళం ఆకారంలో హైడ్రోజన్ వాయువుతో నిండిన బెలూన్ ద్వారా సుదూర ప్రాంతాలకు మనుషులను, సరుకులను రవాణా చేయడానికి వినియోగించే విహంగ నిర్మాణమే ఎయిర్‌షిప్. గాలి కంటే తక్కువ బరువు ఉండే హైడ్రోజన్ వాయువును ఎయిర్‌షిప్ బెలూన్‌లో తొలుత వాడేవారు. అయితే, హైడ్రోజన్‌కు మండే స్వభావం ఎక్కువగా ఉండటంతో ఆ తర్వాత హీలియంను వినియోగించారు.

■ మళ్లీ తెర మీదకు ఇలా..

వాతావరణంలోకి విడుదలవుతున్న కర్బన ఉద్గారాల కారణంగా భూతాపం పెరిగిపోతున్నది. 2.5 శాతం కర్బన ఉద్గారాలు విమానాల కారణంగానే విడుదల అవుతున్నట్టు నివేదికలు చెప్తున్నాయి. ఈ ఉద్గారాల కారణంగా వాతావరణ మార్పులు జరిగి ధ్రువ ప్రాంతాల్లో మంచు కరిగి, సముద్ర జలాలు వేడెక్కి జీవావరణానికే ముప్పు వాటిల్లే దుస్థితి దాపురించింది. ఈ క్రమంలోనే విమానాల స్థానంలో ముఖ్యంగా కార్గో విమానాలకు ప్రత్యామ్నాయంగా ఎయిర్‌షిప్‌లను తీసుకురావాలని శాస్త్రవేత్తలు కసరత్తు ప్రారంభించారు.

■ సవాళ్లు లేకపోలేదు

ఎయిర్‌షిప్‌ల వాడకంలో కొన్ని సవాళ్లు ఎదురవుతున్నాయి. అందులో మొదటిది వీటిలో ఇంధనంగా వాడే హీలియం లభ్యత. భూమిపై హీలియం లభ్యత తక్కువగా ఉన్నది. 1 కిలో సరుకును మోయడానికి 1 క్యూబిక్ మీటర్ హీలియం అవసరమవుతుంది. దీనికి రూ. 3 వేల వరకూ వెచ్చించాల్సి రావొచ్చు. ఇది ఖర్చుతో కూడుకొన్న వ్యవహారం. ఇక మరో ప్రధాన సమస్య.. సరుకు రవాణా జరిగేప్పుడు ఎలాంటి అవాంతరాలు కలుగనప్పటికీ, సరుకును ఎయిర్‌షిప్‌లోకి ఎక్కించడం, దించడం సమయంలో సదరు వాహకనౌకా బరువును సమతుల్యంతో (బ్యాలెన్స్‌డ్‌గా) నిలపగలగాలి. లేకపోతే అది కూలిపోయే ప్రమాదం ఉన్నది. వేగం కూడా ఇంకో సమస్యగా మారింది. అయితే, వీటికి తగిన పరిష్కారాలను కనుగొనే పనిలో ఉన్నట్టు పలువురు నిపుణులు చెప్తున్నారు.

■ రేసులో కంపెనీలు

సరికొత్త ఎయిర్‌షిప్‌ల తయారీకి ఇప్పటికే పలు కంపెనీలు సిద్ధమయ్యాయి. ఫ్రాన్స్‌కు చెందిన ఫ్లయింగ్ వేల్స్ అనే కంపెనీ ఫ్లయింగ్ క్రేన్ పేరిట 200 మీటర్ల పొడువున్న ఎల్‌సీ ఏ60టీ హీలియమ్ ఎయిర్‌షిప్‌ను ఇప్పటికే అందుబాటులోకి తీసుకొచ్చింది. రాకెట్ విడిభాగాలు, పవర్‌లైన్ టవర్లు, టర్బైన్ బ్లేడ్లు, ఏజెన్సీ ఏరియాలకు తాత్కాలిక దవాఖాన భవనాలు, కర్మాగారాలకు అడవుల నుంచి కలప తదితర రవాణాకు దీన్ని వినియోగిస్తున్నారు. ఏరోస్ అనే మరో కంపెనీ కూడా ఈ తరహా ఎయిర్‌షిప్‌నే అందుబాటులోకి తీసుకొచ్చింది.



నిషేధం అలా..

1937 మే 6న అమెరికాలో 'హిండెన్‌బర్గ్ ఎయిర్‌షిప్ ప్రమాదం' జరిగింది. ఈ ఘటనలో 36 మంది మరణించారు. హైడ్రోజన్ గ్యాస్ లీకవ్వడం, అప్పుడే ఎలక్ట్రోస్టాటిక్ డిశ్చార్జీ సిస్టమ్‌లో చిన్న నిప్పురవ్వలు ఏర్పడటంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటన జరిగిన తర్వాత ఎయిర్‌షిప్‌ల వినియోగాన్ని పెద్దమొత్తంలో తగ్గించారు. అలాగే విమానాలతో పోలిస్తే వేగంలో ఎయిర్‌షిప్‌లు వెనుకబడటంతో క్రమంగా ఇవి కనుమరుగయ్యాయి.

జీపీఎస్ సిగ్నల్స్ తారుమారు

ఉత్తర కొరియాపై దక్షిణ కొరియా ఆగ్రహం

సియోల్, నవంబర్ 9: దక్షిణ కొరియాను కవ్వించేందుకు ఉత్తర కొరియా మరో ఎత్తుగడ వేసింది. మొన్నటివరకు చెత్త బెలూన్లను ప్రయోగించిన కిమ్ సర్కార్, తాజాగా జీపీఎస్ సిగ్నల్స్‌ను తారుమారు చేయటాన్ని ఎంచుకుంది. సరిహద్దులో గత రెండు రోజులుగా ఉత్తర కొరియా నుంచి విడుదలవుతున్న జీపీఎస్ సిగ్నల్స్.. దక్షిణ కొరియాకు తలనొప్పిగా మారాయి. దక్షిణ కొరియాకు చెందిన పలు విమాన, నౌకా ప్రయాణాలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయి. దీనిపై ఆ దేశ మిలటరీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తారుమారు చేసిన జీపీఎస్ సిగ్నల్స్‌తో తమ దేశ విమాన సర్వీసులు, పశ్చిమ సముద్రంలో నడుస్తున్న ఓడల ప్రయాణాల్లో సమస్యలు తలెత్తాయని, ఇకనైనా ఈ కవ్వింపు చర్యల్ని ఆపాలని దక్షిణ కొరియా హెచ్చరించింది. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే దానికి ఆ దేశం బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టంచేసింది.

విదేశీ విద్యార్థులకు కెనడా షాక్

- స్టూడెంట్ డైరెక్ట్ స్ట్రీమ్ విధానానికి ముగింపు
- భారతీయ విద్యార్థులపై ప్రతికూల ప్రభావం
- ఇక వీసాల కోసం ఎదురుచూపులు తప్పవు

టొరంటో, నవంబర్ 9: భారత్ సహా 14 దేశాల విదేశీ విద్యార్థులకు కెనడా షాకిచ్చింది. విద్యార్థులకు వేగంగా స్టడీ వీసా ఇచ్చేందుకు 2018లో ప్రారంభించిన స్టూడెంట్ డైరెక్ట్ స్ట్రీమ్(ఎస్‌డీఎస్) విధానాన్ని కెనడా ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో పాటు నైజీరియా విద్యార్థులకు వేగంగా వీసా కల్పించే నైజీరియా స్టూడెంట్ ఎక్స్‌ప్రెస్(ఎన్ఎస్ఈ) విధానాన్ని కూడా ఆపేసింది. 'విద్యార్థులందరికీ దరఖాస్తు ప్రక్రియలో సమాన అవకాశాన్ని, పారదర్శక విధానాన్ని, సానుకూల విద్యా అనుభవాన్ని అందించేందుకు ఎస్‌డీఎస్, ఎన్ఎస్ఈ కార్యక్రమాలను తక్షణం నిలిపివేస్తున్నాం.' అని కెనడా ప్రభుత్వం ప్రకటించింది. ఇక నుంచి విద్యార్థులంతా సాధారణ స్టడీ పర్మిట్ విధానం ద్వారానే దరఖాస్తు చేసుకోవాలని, అంతర్జాతీయ విద్యార్థులను స్వాగతిస్తూనే ఉంటామని పేర్కొన్నది. ఎస్‌డీఎస్, ఎన్ఎస్ఈ కింద శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల లోగా దరఖాస్తు చేసుకున్న వారిని పరిగణనలోకి తీసుకుంటామని వెల్లడించింది. ఆర్థికపరమైన సవాళ్లు, ఆరోగ్య వ్యవస్థపై ఒత్తిడి, పెరుగుతున్న జీవనవ్యయం, ఇండ్ల లభ్యత తగ్గిపోవడం వంటి కారణాలతో దేశంలోకి వలసలను తగ్గించేందుకు కెనడా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నది.

భారత విద్యార్థులపై తీవ్ర ప్రభావం

ఎస్‌డీఎస్ విధానం రద్దు చేయడం కెనడాకు వెళ్లి చదువుకోవాలనుకునే భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఇంతకుముందు ఎస్‌డీఎస్ ద్వారా మన విద్యార్థులకు వేగంగా కెనడా స్టడీ వీసాలు దక్కేవి. ఇక నుంచి భారతీయ విద్యార్థులు సాధారణ విధానం ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో వీసా కోసం ఎదురుచూడాల్సి వస్తుంది. కాగా, కెనడాలోని మొత్తం విదేశీ విద్యార్థుల్లో భారతీయుల సంఖ్య దాదాపు 35 శాతం వరకు ఉంటుంది.

మా దేశాన్ని వదిలి వెళ్లండి

- హమాస్ నేతలతో ఖతార్
- అమెరికా ఒత్తిడి మేరకు నిర్ణయం

దోహా: తమ దేశాన్ని వదిలిపెట్టి వెళ్లిపోవాలని హమాస్ నేతలను ఖతార్ ఆదేశించింది. 2012 నుంచి హమాస్ రాజకీయ కార్యాలయం ఖతార్ రాజధాని దోహాలో కొనసాగుతున్నది. హమాస్ ముఖ్య నేతలు ఖతార్ నుంచే తమ కార్యకలాపాలను సాగిస్తున్నారు. అయితే, ఇజ్రాయెల్ - హమాస్ యుద్ధానికి విరామం పలికి, బందీలను విడుదల చేయించేందుకు అమెరికా, ఈజిప్ట్, ఖతార్ హమాస్‌తో కొన్ని నెలలుగా చర్చలు జరుపుతున్నాయి. తాజాగా అక్టోబర్ మధ్యలోనూ చర్చలు జరగగా, ఒప్పంద ప్రతిపాదనను హమాస్ తిరస్కరించింది. దీంతో హమాస్ నేతలకు ఆశ్రయం కల్పించొద్దని ఖతార్‌పై అమెరికా ఒత్తిడి ప్రారంభించింది. ఈ నేపథ్యంలో తమ దేశాన్ని వీడాలని 10 రోజుల క్రితం హమాస్ నేతలకు ఖతార్ తేల్చిచెప్పింది.

రష్యాలో 'శృంగార మంత్రిత్వ శాఖ'!

జననాల రేటు పెంచేందుకే

న్యూఢిల్లీ: మీరు చదివింది నిజమే! శృంగార మంత్రిత్వ శాఖ ఏర్పాటుకు రష్యా ప్రభుత్వం సమాయత్తం అవుతున్నది. గతంలో ఎన్నడూ లేనంతగా జననాల రేటు పడిపోవడం, మరోవైపు ఉక్రెయిన్‌తో యుద్ధం కారణంగా సంభవిస్తున్న ప్రాణనష్టంతో ఆందోళన మొదలైంది. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన ప్రభుత్వం జననాల రేటు పెంచేందుకు రెడీ అవుతున్నది. అందులో భాగంగా శృంగారం కోసం ప్రత్యేకంగా ఓ శాఖను ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి వచ్చింది. ఇక, జననాల రేటు పెంచడంలో భాగంగా రాత్రివేళ ఇంటర్నెట్ పూర్తిగా ఆఫ్ చేయడం, కరెంటు తీసేయడం వంటి పలు ఆలోచనలు చేస్తున్నది. దీనివల్ల జంటల మధ్య సాన్నిహిత్యం పెరుగుతుందని, అది జననాల రేటు పెరిగేందుకు దోహదం చేస్తుందని భావిస్తున్నది. 1999 తర్వాత తొలిసారి ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో జననాల రేటు దారుణంగా పడిపోయింది. ఈ 'విపత్తు' నుంచి గట్టెక్కేందుకు 'మినిస్ట్రీ ఆఫ్ సెక్స్' (శృంగార మంత్రిత్వశాఖ)ను ఏర్పాటు చేయాలన్న డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నది. అలాగే ఇంటర్నెట్ సేవలను రాత్రివేళ నిలిపివేయడంతోపాటు రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాను నిలిపివేయాలని భావిస్తున్నది. జననాల రేటు పెంచేందుకు ఇలాంటి పలు ఐడియాలను ప్రభుత్వం పరిశీలిస్తున్నది. ఇంట్లో ఉండే తల్లలుకు 'వేతనం' ఇవ్వడం, వివాహం తర్వాత హోటళ్లలో బస చేసే జంటకు అయ్యే ఖర్చును భరించడం, డేటింగ్‌ను ప్రోత్సహించడం వంటి పలు ఆలోచనలను పరిశీలిస్తున్నది. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో రష్యాలో 5,99,600 జననాలు మాత్రమే నమోదయ్యాయి. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే 16 వేల జననాలు తక్కువగా నమోదయ్యాయి. జననాల రేటు ఇంత దారుణంగా పడిపోవడం 1999తో పోలిస్తే ఇదే తొలిసారి.

నీట్ స్టూడెంట్‌ను నిర్బంధించి నెలల తరబడి అఘాయిత్యం

ఇద్దరు టీచర్ల అరెస్ట్

కాన్పూర్: యూపీలోని కాన్పూరులో నీట్ కోసం శిక్షణనిచ్చే ఓ ప్రముఖ సంస్థకు చెందిన ఇద్దరు టీచర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఓ ఫతేపూర్ బాలిక కాన్పూర్‌లోని నీట్ శిక్షణ సంస్థలో చేరారు. ఆమె సిటీ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటుండగా, ఈ శిక్షణ కేంద్రంలోని బయాలజీ టీచర్ సాహిల్ సిద్ధిఖీ తన స్నేహితుని ఫ్లాట్‌కు రావాలని ఆమెను పిలిచాడు. న్యూ ఇయర్ పార్టీ జరుగుతుందని, ఇతర విద్యార్థులు కూడా వస్తారని చెప్పాడు. కానీ ఆమె ఆ ఫ్లాట్‌కు వెళ్లేసరికి సిద్ధిఖి ఒక్కడే ఉన్నాడు. అతడు ఆమెకు మత్తు మందు పానీయాన్ని ఇచ్చి అత్యాచారం చేశాడు. ఎవరికైనా చెబితే ఆ రేప్ వీడియోను ఆన్‌లైన్‌లో షేర్ చేస్తానని బెదిరించాడు. ఆ తర్వాత ఆరు నెలలపాటు అదే ఫ్లాట్‌లో ఆమెను నిర్బంధించి, పదే పదే అత్యాచారం చేశాడు. ఇదే కోచింగ్ సెంటర్‌లోని కెమిస్ట్రీ టీచర్ వికాస్ పోర్వాల్ కూడా సిద్ధిఖీ ఎపిసోడ్ తర్వాత ఆమెపై లైంగిక దాడి చేశాడు. తర్వాత తన తల్లి తనను ఇంటికి తీసుకెళ్లారని బాధితురాలు తెలిపారు. సిద్ధిఖీ వేరొక స్టూడెంట్‌ను వేధిస్తున్న వీడియోను చూశానని, దీంతో తనపై జరిగిన లైంగిక దాడిపై గురించి ఫిర్యాదు చేశానని బాధితురాలు తెలిపారు.

సమోసాలపై సీఐడీ విచారణపై నిరసన

సీఎంకు సమోసాలు పంపించిన బీజేవైఎం

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లో సమోసాల చుట్టూ రాజకీయం తిరుగుతున్నది. గత నెల ముఖ్యమంత్రి సుఖు పాల్గొన్న ఓ కార్యక్రమంలో సమోసాలు పోవడం, దానిపై సీఐడీ విచారణ జరుపుతుండటంతో వివాదం మొదలైంది. 'సీఎం తినాల్సిన సమోసాలు పోయాయని సీఐడీ విచారణనా?' అంటూ బీజేపీ ప్రశ్నిస్తున్నది. సీఐడీ విచారణపై భారతీయ జనతా యువ మోర్చా(బీజేవైఎం) శనివారం వినూత్న నిరసన చేపట్టింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ప్రజలకు సమోసాలు పంచిపెట్టింది. సీఎం ఇంటికి ఆన్‌లైన్‌లో 11 సమోసాలు ఆర్డర్ చేసి పంపింది.

మరింత ఘాటెక్కిన ఉల్లి

న్యూఢిల్లీ, నవంబర్ 9: దేశంలో ఉల్లి ఘాటు మరింత పెరిగింది. నిన్న మొన్నటి వరకు హోల్‌సేల్ మార్కెట్లలో రూ.40-60 పలికిన కిలో ఉల్లిపాయల ధర.. ఇప్పుడు రూ.70-80కి చేరింది. శుక్రవారం కొన్ని ప్రాంతాల్లో రూ.80 కంటే అధిక ధర పలికింది. దీంతో కుటుంబ బడ్జెట్లు తల్లకిందులై వినియోగదారులు అల్లాడుతున్నారు. ద్రవ్యోల్బణంతోపాటు ఉల్లి కొనుగోలు ధరలు పెరగడమే ఇందుకు కారణమని వ్యాపారులు చెప్తున్నారు. మండీల్లో కిలో ఉల్లి ధర రూ.60 నుంచి రూ.70కి పెరిగిందని, అమ్మకాలపై ప్రభావం చూపుతుండటంతో విక్రయాలు తగ్గాయని, అయినప్పటికీ రోజువారీ ఆహారంలో ఎంతో కీలకపాత్ర పోషిస్తున్న ఉల్లిపాయలను జనం కొంటూనే ఉన్నారని ఢిల్లీ మార్కెట్‌లోని ఓ వ్యాపారి తెలిపారు. ధరల పెరుగుదలపై వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉల్లితోపాటు వెల్లుల్లి ధర కూడా రెట్టింపు కావడంతో కుటుంబ బడ్జెట్‌ను దెబ్బతీస్తున్నదని కొనుగోలుదారులు వాపోతున్నారు.

2 వేల లీటర్ల తల్లిపాలు దానం

వాషింగ్టన్, నవంబర్ 9: అమెరికాలోని టెక్సాస్‌కు చెందిన మహిళ అలైస్ ఒగ్లిట్రీ (36).. మాతృ హృదయాన్ని గొప్పగా చాటుకున్నారు. ప్రపంచంలో అత్యధికంగా తల్లి పాలను దానం చేసిన వ్యక్తిగా గిన్నిస్ రికార్డ్ సృష్టించారు. ఆమె దానమిచ్చిన తల్లిపాలు.. నెలలు నిండకుండా జన్మించిన వేలాది మంది నవజాత శిశువుల కడుపు నింపుతున్నాయని 'గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్' వెబ్‌సైట్ తాజాగా పేర్కొన్నది. టెక్సాస్‌లోని ఫ్లవర్ మౌండ్‌కు చెందిన 36 ఏండ్ల ఒగ్లిట్రీ జూలై 2023 కల్లా 2,645 లీటర్ల తల్లిపాలు దానం ఇచ్చారని 'గిన్నిస్' గుర్తించింది. 'నా మనసు గొప్పదే. డబ్బులు దానం ఇవ్వలేను. కానీ తల్లి పాలు ఇవ్వొచ్చు కదా! అన్న ఆలోచన వచ్చింది' అని 'గిన్నిస్ ఆర్గనైజేషన్' ఇంటర్వ్యూలో ఒగ్లిట్రీ చెప్పారు. నెలలు నిండకుండా పుట్టిన శిశువులను ఇన్క్యూబేటర్లు చుట్టుముడతాయి. ఇలాంటి శిశువుల కోసం దాతల నుంచి సేకరించిన తల్లి పాలను 'హ్యూమన్ మిల్క్ బ్యాంక్' పంపిణీ చేస్తున్నది.

ట్రంప్ గెలుపుతో భారీగా పెరిగిన మస్క్ సంపద

రూ.25.31 లక్షల కోట్లతో రికార్డ్

న్యూఢిల్లీ: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ నికర సంపద విలువ శుక్రవారం రూ.25.31 లక్షల కోట్లకు చేరింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి ఆయన కంపెనీ టెస్లా విలువ పెరగడంతో ఈ రికార్డు నమోదైంది. ఫోర్బ్స్ రియల్ టైమ్ బిలియనీర్స్ జాబితా ఈ వివరాలను వెల్లడించింది. టెస్లా మార్కెట్ విలువ శుక్రవారం 1 ట్రిలియన్ డాలర్ల వద్ద ముగిసింది. రెండేళ్లలో ఇంత భారీ స్థాయికి చేరడం ఇదే ప్రథమం. ఈ కంపెనీ షేర్ల విలువ 8.2 శాతం పెరిగి 321.22 డాలర్లకు చేరింది. ఈ కంపెనీ స్టాక్ ఈ వారం 29 శాతం లాభపడింది. 2023 జనవరి నుంచి అత్యుత్తమ పనితీరుకు నిదర్శనంగా ఈ పెరుగుదల కనిపిస్తున్నది. అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాల తర్వాత బాగా లాభపడినది బహుశా టెస్లా, ఆ కంపెన